క్లుప్తంగా

సత్యనారాయణమ్మ నియామకంపై హర్షం

కర్నూలు(అర్బన్): వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలిగా నగరంలోని 25వ వార్డు కార్పొరేటర్ సిత్రా సత్యనారాయణమ్మను నియమించడంపై కురువ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశా రు. గురువారం స్థానిక కార్యాలయంలో జరిగి న సమావేశంలో సంఘం జిల్లా గౌరవాధ్యక్షు డు కె. కిష్టన్న, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్తికొండ శ్రీనివాసులు, ఎంకే రంగస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ న్యాయవాదిగా, వార్డు కార్పొరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణమ్మకు వైఎస్సార్‌సీపీ సముచిత స్థానాన్ని ఇచ్చిందన్నారు. రాజకీయంగా ఆమె మరింత ఎత్తుకు ఎదగాలని, మరిన్ని పదవులు అలంకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో నేతలు గుడిసె శివన్న, జిల్లా మహిళా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు టి. లీలమ్మ, కె. అనిత, నాయకులు కత్తి శంకర్, ఉరుకుందు, బీ వెంకటేశ్వర్లు, తిరుపాలు, దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ సామాజిక సేవ చేయాలి



పేద ముస్లింలకు నిత్యావసర కిట్లు అందజేస్తున్న డాక్టర్ బి. శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): ప్రతి ఒక్కరూ తమ సంపాదనలో ఎంతో కొంత భాగాన్ని సామాజిక సేవకు వినియోగించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని పేద ముస్లిం మహిళలకు గురువారం ఆయన గాయత్రి ఎస్టేట్‌లోని తన క్లినిక్‌లో నిత్యావసర కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో దీక్షతో ఉపవాస దీక్షలు చేపడతారన్నారు. పేద ముస్లిం కుటుంబాలు కూడా సంతోషంగా పండుగ జరుపుకోవాలన్న ఉద్దేశంతో ఈ కిట్లను తన వంతు బాధ్యతగా అందజేసినట్లు తెలిపారు. అలాగే ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండటం వల్ల వడదెబ్బకు గురిగాకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా లాజరస్

కర్నూలు(సెంట్రల్): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్‌గా ఎండ్లూరి లాజరస్ నియమితులయ్యారు. అలాగే రాష్ట్ర కార్యవర్గంలో జిల్లాకు చెందిన బజారన్న, దానమయ్య, కిరణ్‌కుమార్, గోవిందు, పోతురాజులను నియమించారు. ఈమేరకు రాష్ట్ర నాయకత్వం నుంచి డీసీసీకి సమాచారం అందింది. వారికి డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు నియామక పత్రాలను అందజేశారు.

పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోండి



సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు 33 శాఖల పరిధిలోని ప్రభుత్వ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని ఎన్నికల సంఘం కల్పించిందని 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ స్పష్టం చేశారు.గురువారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి, మున్సిపల్ ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో ఉంటున్న వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో అర్బన్ తహసీల్దార్ మోహన్ కుమార్, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, కార్యదర్శి నాగరాజు, మ్యాన్ పవర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌యూ ఉద్యోగులకు మెమో

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో సమయ పాలన పాటించని పలురు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు మెమో జారీ చేసినట్లు వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సీవీ కృష్ణారెడ్డి తెలిపారు. వీసీ ఆచార్య బి. సుధీర్ ప్రేమ్ కుమార్ కంప్యూటర్ సైన్స్, మ్యాథ్స్ డిపార్ట్‌మెంట్‌లను ఆకస్మికంగా సందర్శించారన్నారు. పలువురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు సమయ పాలన పాటించడం లేదని, మరికొందరు రెగ్యులర్‌గా వర్సిటీకి ఆలస్యంగా వస్తున్నట్లు తెలిసిందన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగం కోర్డినేటర్ జి.రవికుమార్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నాగమణి, రాజేశ్వరి, విజయకుమార్, మ్యాథ్స్ విభాగంలో సునీత, నాగిరెడ్డిలు సమయ పాలన పాటించక పోవడంతో వారికి మెమో ఇవ్వాలని వీసీ ఆదేశించారని పేర్కొన్నారు.

దగా ఆలోచనలపై నిఘా!

- ఎన్నికల ప్రచార తీరుపై పోలీసులు ప్రత్యేక దృష్టి
- సామాజిక మాధ్యమాల్లో తప్పుడు పోస్టింగులపై కూడా
- అభ్యంతరకర పోస్టులు షేర్ చేస్తే చిక్కులే



కర్నూలు: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి రాజకీయ పార్టీలు సామాజిక మాధ్యమాలను వేదికగా చేసుకుంటున్నాయి. వాటి ద్వారానే కొందరు అసత్య వార్తలు, తప్పుడు కథనాలు ప్రచారం చేస్తున్నారు. మరీ ముఖ్యంగా ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్నారు. తమ ఉనికి చాటుకోవాలనే ప్రయత్నాల్లో కొందరు సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నట్లు పోలీసు వర్గాలు అంచనాకు వచ్చాయి. అలాంటి వారిని కట్టడి చేసేందుకు సోషల్ మీడియాపై దృష్టి సారించాలని పోలీసు ఉన్నతాధికారుల నుంచి క్షేత్రస్థాయి అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి.

ప్రచార తీరుపై కన్ను...

సార్వత్రిక ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అనుకోని సంఘటనలకు చోటు ఇవ్వకూడదని పోలీసు అధికారులు ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నారు. బందోబస్తు, రౌడీషీటర్ల కౌన్సెలింగ్ అసాంఘిక శక్తులపై నిఘా వంటి వాటితో పాటు పట్టణాలు, గ్రామాల్లో ప్రచారాల తీరుపై కూడా దృష్టి పెట్టారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పార్టీల ప్రచారాలను పోలీసు సిబ్బంది మఫ్టీలో గమనిస్తున్నారు. ఎక్కడైనా నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారా, ప్రత్యర్థులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు వంటివాటిని పరిశీలిస్తున్నారు. జిల్లాలో 42 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. ఆ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో పార్టీల ప్రచారాలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. ఎవరైనా సమస్యాత్మక వ్యక్తులు, నేరచరిత్ర ఉన్నవారు, సంఘ విద్రోహ శక్తులు ప్రచారాల్లో తిరుగుతున్నారా, మద్యం, డబ్బు ప్రభావం ఎలా ఉంది? తదితర అంశాలకు సంబంధించి గమనిస్తున్నారు. ఎక్కడా గొడవలకు ఆస్కారం లేకుండా రౌడీషీటర్లకు స్టేషన్ల వారీగా కౌన్సిలింగ్ ఇస్తున్నారు.

గతంలో జరిగిన సంఘటనలు...

☛ గత ఎన్నికల్లో 28 ఏళ్ల యువకుడు ప్రధాన పార్టీ అభ్యర్థికి సంబంధించిన అభ్యంతరకరమైన వీడియోను సృష్టించి సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. కించపరచే విధంగా ఉందని ఆ వీడియోపై ఫిర్యాదు రావడంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌తో పాటు ఐటీ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రభుత్వ ఉద్యోగ వేటలో ఉన్న ఆ యువకుడు కేసుల్లో చిక్కుకోవడంతో ఉన్నతాశయం చేరుకోవడానికి ప్రతిబంధకంగా మారింది.

☛కరోనా సమయంలో కర్నూలులో తప్పుడు ప్రచారం జరిగింది. సామాజిక మాధ్యమాలు, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో వీడియోలను వైరల్ చేశారు. చివరకు పోలీసులు రంగంలోకి దిగి అసత్యాలను వార్తలుగా చేసి సోషల్ మీడియాలో పంపారని పోలీసులు తేల్చారు. ఇలా సోషల్ మీడియాలో వచ్చిన ఫిర్యాదులు పోలీసుల నిఘా ద్వారా గుర్తించిన వాటిపై గతంలో పలు కేసులు నమోదయ్యాయి. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ధోరణి పెరిగే అవకాశముందని భావించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఓ పోలీసు అధికారి తెలిపారు.

అభ్యంతరకర పోస్టులకు గ్రూప్ అడ్మిన్‌దే బాధ్యత

వాట్సాప్, ఫేస్‌బుక్, ఇతర సామాజిక మాధ్యమాల్లోని గ్రూపుల్లో ఉండే సభ్యులు ఇష్టానుసారంగా పోస్టులు, వ్యాఖ్యానాలు చేస్తుంటారు. అభ్యంతరకర పోస్టులకు గ్రూప్ అడ్మిన్ బాధ్యత వహించాల్సి ఉంటుందని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. వాటిలో వచ్చే రెచ్చగొట్టే వ్యాఖ్యానాలు అభ్యర్థుల వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసే విధంగా చేసినట్లయితే వాటికి బాధ్యత వహించాల్సిందేనని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌తో పాటు ప్రజాప్రాతినిధ్య ఐటీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు.

ఉన్నత లక్ష్యంతోనే జీవితంలో రాణింపు

- ఆర్‌యూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్‌ప్రేమ్‌కుమార్



క్విజ్ విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ సుధీర్ ప్రేమ్ కుమార్, రెక్టార్ ఎన్‌టీకే నాయక్

కర్నూలు కల్చరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యం కలిగి ఆ దిశగా సాధన చేస్తే జీవితంలో రాణిస్తారని రాయలసీమ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బి. సుధీర్‌ప్రేమ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రతి సంవత్సరం నిర్వహించే క్విజ్ పోటీల క్విజ్ ఛాంపియన్‌షిప్ -2024 రీజనల్ క్వాలిఫైర్స్ రౌండ్‌ను గురువారం వర్సిటీ సెనెట్ హాల్‌లో వీసీ ప్రారంభించి ప్రసంగించారు. ఉన్నత విద్యా సంస్థల్లో విద్యను అభ్యసించే విద్యార్థులు కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా వివిధ విషయాల పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. ప్రాజెక్ట్ వర్క్, కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు, ఇంటర్న్ షిప్ లాంటి కార్యక్రమాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. అందులో భాగంగా ఈ సంవత్సరం రీజనల్ స్థాయి పోటీల నిర్వహణ బాధ్యతను రాయలసీమ యూనివర్సిటీకి అప్పగించారన్నారు. వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకొని మరింత ముందుకు సాగాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రా ర్ డాక్టర్ నాగుల అంకన్న, ఉన్నత విద్యా మండలి అకడమిక్ ఆఫీసర్ ఆచార్య ఎస్.చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం క్విజ్ విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.వి.కృష్ణారెడ్డి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య ఎన్.నరసింహులు, పరీక్షల విభాగం డీన్ ఆచార్య పుచ్చా వెంకట సుందరానంద్, అకడమిక్ అఫైర్స్ డీన్ ఆచార్య భరత్‌కుమార్, రీసెర్చ్ డైరెక్టర్ ఆచార్య సి.విశ్వనాథరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై. హరిప్రసాద్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి యంగ్ ప్రొఫెషనల్ శ్రీజ, అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇక రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా

కర్నూలు (టౌన్) : నగరంలో ఏప్రిల్ రెండో వారం నుంచి తాగునీటి సరఫరా రోజు విడిచి రోజు ఉంటుందని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది అతి తక్కువ వర్షపాతం నమోదైందని తెలిపారు. సుంకేసుల రిజర్వాయర్‌లో ఉన్నటువంటి నీటి నిల్వలు అడుగంటిపోయినట్లు తెలిపారు. ప్రస్తుతం 70 కిలో మీటర్ల దూరంలో ఉన్న గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి తాగునీటిని కేసీ కెనాల్ ద్వారా తీసుకొస్తున్నామన్నారు. అయితే, ప్రతి రోజు నీటి సరఫరాకు అవసరమైన మేర నీళ్లు రావడం లేదని తెలిపారు. దీంతో వేసవికాలం ముగిసే వరకు నగరంలోని 52 వార్డులకు రోజు విడిచి రోజు నీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు తయారు చేసినట్లు తెలిపారు. నగర ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకొని నగరపాలక సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఉగాదికి ప్రత్యేక బస్సులు

కర్నూలు (సిటీ) :ఉగాది పండుగ నేపథ్యంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు జిల్లా ప్రజా రవాణ అధికారి టి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు డిపోల నుంచి శ్రీశైలం, ఇతర శైవక్షేత్రాలకు ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా 115 బస్సులు నడపనున్నట్లు ఆయన తెలిపారు.

వలంటీర్ల రాజీనామా

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలోని 49 వ వార్డు 125 వ సచివాలయంలో వలంటీర్లుగా పనిచేసే ప్రకాష్‌నగర్‌కు చెందిన ఎం. ప్రేమ్ కుమార్ , ఎ. సందీప్, జె. మంజునాథ్ గురువారం రాజీనామా చేశారు.వ్యక్తిగత కారణాలతో తాము రాజీనామ చేస్తున్నట్లు లిఖిత పూర్వకంగా వార్డు అడ్మిన్‌కు లేఖ రాశారు.

నేడు సంపూర్ణ భగవద్గీత పారాయణం

కర్నూలు కల్చరల్: ఫాల్గుణ శుక్ల ఏకాదశిని పురస్కరించుకుని సంకల్‌బాగ్‌లోని శ్రీగీతా ప్రచార ధామంలో శుక్రవారం ఉదయం 9.30 గంటలకు సంపూర్ణ భగవద్గీత పారాయణ యజ్ఞం ఏర్పాటు చేసినట్లు గీతా ప్రచార సంఘం అధ్యక్షుడు డి.వి.రమణ తెలిపారు. , వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు, గీతా ప్రచార మండలి సభ్యులు, భక్తులు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

ఊపందుకున్న పింఛన్ల పంపిణీ





పింఛన్ పంపిణీ చేస్తున్న సచివాలయ ఉద్యోగులు, భగవాన్ నగర్ సచివాలయం వద్ద పింఛన్ కోసం నిరీక్షణ

- మండుటెండలతో ఇబ్బంది పడిన అవ్వాతాతలు
- నగరంలో 94 శాతం పెన్షన్ పంపిణీ

కర్నూలు (టౌన్) : నగరంలో సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు. అయితే, ఇది వరకులాగా ఇంటి వద్ద కాకుండా సచివాలయాల్లో పంపిణీ చేయడంతో అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు ఇబ్బంది పడ్డారు. తొలి రోజు మాదిరిగానే రెండోరోజు గురువారం ఉదయం కూడా పలు సచివాలయాల వద్ద పెన్షన్‌దారులు అవస్థలు పడ్డారు. పెన్షన్ సొమ్ము తీసుకునేందుకు గంటల తరబడి ఎదురుచూడాల్సి వచ్చింది. వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పెన్షన్ పంపిణీని చంద్రబాబు అడ్డుకోవడంతో తమకు ఈ కష్టాలు అని అవ్వాతాతలు, దివ్యాంగులు వాపోయారు. కాగా ఈనెల 6వ తేదీ లోపు పెన్షన్ పంపిణీ ప్రక్రియ పూర్తి కావాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో నగరంలోని పలు సచివాలయాల్లో సిబ్బంది ఉదయం నుంచే పంపిణీని శ్రీకారం చుట్టారు. గురువారం సాయంత్రం వరకు మొత్తం 32,012 మందికి (94.18 శాతం) రూ.9,71,21,000 అందజేసినట్లు నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ వెల్లడించారు.

చెక్‌బౌన్స్ కేసులో జైలుశిక్ష

కర్నూలు (లీగల్) : తీసుకున్న అప్పు చెల్లింపులో భాగంగా ఇచ్చిన బ్యాంకు చెక్కు బౌన్స్ అయిన కేసులో ఓ ప్రభుత్వ ఉద్యోగికి 3 నెలల జైలు శిక్ష, రూ.3 లక్షల జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు గురువారం తీర్పు చెప్పింది. వెల్దుర్తికి చెందిన విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి బీవీ వెంకటరాముడు వద్ద నగరంలోని హంద్రీ నీవా సుజల ప్రవంతి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసే బి. వెంకటరమణయ్య 2016 సంవత్సరంలో రెండు సార్లు తన అవసరాల కోసం రూ.3 లక్షలు అప్పు తీసుకుని 3 ప్రాంసరీ నోట్లు రాసిచ్చాడు. చెల్లింపులో భాగంగా 2017 సంవత్సరంలో రూ.లక్ష చొప్పున మూడు బ్యాంకు చెక్కులను ఫిర్యాదికి ఇచ్చాడు. తన బ్యాంకులో తగిన నిల్వలు లేక ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయి. దీంతో ఫిర్యాది న్యాయస్థానాన్ని ఆశ్రయించగా కేసును విచారించిన న్యాయమూర్తి జ్యోత్స్న దేవి నిందితుడైన బి.వెంకటరమణయ్యకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు

కల్లూరు : ప్రజాస్వామ్యాన్ని కాపాడే ఆయుధం ఓటు అని, ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పాణ్యం ఆర్వో/జేసీ నారపురెడ్డి మౌర్య అన్నారు. గురువారం కల్లూరు మండలం పందిపాడు, పెద్దటేకూరు, ఉలిందకొండ, కొంగనపాడు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఉలిందకొండ గ్రామంలో ఓటర్లకు అవగాహన కోసం నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్నారు. జేసీ మాట్లాడుతూ ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఓటర్లు ఎటువంటి భయాందోళనలకు గురి కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా భరోసా ఇవ్వడమే తమ ఉద్దేశమన్నారు.

అత్యవసరమైతేనే బయటకు వెళ్లండి

- వడదెబ్బకు గురిగాకుండా జాగ్రత్తలు తీసుకోండి
- డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్



కర్నూలు(హాస్పిటల్): ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్న తరుణంలో ప్రజలు అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని, అలాగే వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎండ తీవ్రంగా ఉన్నప్పుడు బయట తిరగడం చేయరాదని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎండలోకి వెళితే గొడుగు, టోపీ, తెల్లని రుమాలు తప్పక ధరించాలని, తెల్లని నూలు వస్త్రాలు ధరించాలని, నీరు, ఇతర ద్రవ పదార్థాలు వీలైనంత ఎక్కువగా తీసుకోవాలని, మత్తు పానియాలు తీసుకోరాదని తెలిపారు. చిన్నారులు, వయోవృద్ధులు, గర్భిణులు, బాలింతలు, అనారోగ్యంగా ఉన్న వారు ఎట్టి పరిస్థితుల్లోనూ మధ్యాహ్న సమయంలో ప్రయాణాలు చేయరాదని తెలిపారు. సాధ్యమైనంత వరకు చిన్నపిల్లలతో ప్రయాణం చేయరాదని చెప్పారు. ముఖ్యంగా ఇంటి వద్ద ఉండే పిల్లలు, 60 ఏళ్లు దాటిన వారు, అనారోగ్యంతో బాధపడే వారు తరచుగా మంచినీటిని తాగాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బయట పనికి వెళ్లే వారు ఉదయం 12 గంటల్లోపు, సాయంత్రం 4 గంటల తర్వాత పనిచేసుకోవాలని తెలిపారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, గ్రామ/వార్డు సచివాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఇవి అందుబాటులో లేనప్పుడు ఒక లీటర్ నీటిలో నాలుగు స్పూన్ల పంచదార, అరస్పూను ఉప్పు కలిపిన ద్రావణం తాగడం వల్ల ఉపశమనం లభిస్తుందన్నారు. బస్సు, రైలులో ప్రయాణం చేసేవారు తాగు నీరు వెంట తీసుకెళ్లాలని, దాహం లేకపోయినా వీలైనప్పుడల్లా తగినంత నీటిని తాగాలన్నారు.

మేలు చేసే ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి



35వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి

కల్లూరు: అర్హతే ప్రామాణికంగా రాష్ట్రంలో ప్రతి గడపకు సంక్షేమాన్ని చేరువ చేసిన జగనన్న ప్రభుత్వానికి ఎన్నికల్లో అండగా నిలబడాలని పాణ్యం ఎమ్మెల్యే అభ్యర్థి కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కల్లూరు అర్బన్ 35వ వార్డులో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం కాటసాని మాట్లాడుతూ ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పింఛన్ పంపిణీ చేపడుతుండగా టీడీపీ నాయకులు కుట్రతో అడ్డుకున్నారని విమర్శించారు. 2014లో మోసపూరిత హామీలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చిన అనంతరం వారు ఇచ్చిన హామీలను విస్మరించడంతో పాటు జన్మభూమి కమిటీలతో ప్రజలను వేధింపులకు గురిచేసిందని గుర్తు చేశారు. మరోమారు మోసపూరిత మాటలతో ప్రలోభాలకు గురి చేయడానికి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు వస్తున్నారని, వారి అబద్ధపు మాటలను నమ్మి మోసపోవద్దన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేయాలన్నారు. ఒకటి అసెంబ్లీ అభ్యర్థికి, మరొకటి ఎంపీ అభ్యర్థికి వేయాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మాధురి, పలువురు కార్పొరేటర్లు సాన శ్రీనివాసులు, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివ, వార్డులోని నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు న్యాయం



వైఎస్సార్‌సీపీలో చేరిన 51వ వార్డుకు చెందిన రజక సంఘం నాయకులతో కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్

- వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్
- పార్టీలో చేరిన రజక సంఘం నాయకులు

కర్నూలు (టౌన్) : జగనన్న పాలనలో అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ స్పష్టం చేశారు. గురువారం 51 వ వార్డుకు చెందిన పలువురు రజక సంఘం నాయకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందన్నారు. పేదలు పేదలుగానే ఉన్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు అన్ని వర్గాలకు ఇంటింటికీ సంక్షేమం అందించారన్నారు. పేదలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేశారన్నారు. అందుకే పలువురు వైఎస్ఆర్‌సీపీలో చేరుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో అందరం కలిసి కట్టుగా పార్టీని గెలిపించుకుందామని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో 51 వ వార్డు పార్టీ నాయకులు చంద్రశేఖర్, క్రిష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు అన్న ప్రసాద వితరణ

నగర శివారులోని పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాల వద్ద జిల్లా జంగం మహేశ్వర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీశైలం పాదయాత్ర భక్తులకు గురువారం అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ పాల్గొన్నారు. శిబిరంలో భక్తులతో మాట్లాడారు. యోగాక్షేమాలు తెలుసుకున్నారు.

ఇంతియాజ్‌ను కలిసిన ముస్లిం మైనార్టీ నాయకులు

నెల్లూరుకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు గురువారం స్థానిక ఎన్ఆర్ పేటలోని వైఎస్సార్‌సీపీ నగర కార్యాలయంలో ఇంతియాజ్‌ను కలిశారు. శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఇంతియాజ్ గెలుపునకు తమ వంతుగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు షాజహాన్, మైనార్టీ నాయకులు అతవుర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

నగరపాలక సంస్థ పరిధిలోని 48 వ వార్డు రోజా వీధిలో స్థానిక కార్పొరేటర్, మాజీ స్టాండింగ్ కమిటీ సభ్యులు మల్లికాబేగం గురువారం రాత్రి ఇంట్లో ఇఫ్తార్ విందు ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై.రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, పాణ్యం అభ్యర్థి కాటసాని రాంభూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షురాలు సిత్రా సత్యనారాయణమ్మ, జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్ విజయమనోహరి, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుకా, కార్పొరేటర్ షైజా. అరుణ, పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ మద్దయ్య తదితరులు పాల్గొన్నారు

టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ కష్టాలే

- ఎన్నికల ప్రచారంలో కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి సతీష్



మహిళకు ఓటు అభ్యర్థిస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్

కర్నూలు సిటీ: తెలుగుదేశం పార్టీ నాయకుల మాయమాటలు నమ్మి ఆ పార్టీకి ఓటు వేస్తే కష్టాలు కొనితెచ్చుకున్నట్లు అవుతుందని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డా.ఆదిమూలపు సతీష్ పేర్కొన్నారు. నియోజకవర్గ పరిధిలోని కర్నూలు అర్బన్ 40వ వార్డులో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 99 శాతం అమలు చేశామని, అర్హులైన ప్రతి పేదవాడికి నవరత్నాల ద్వారా పథకాలను అమలు చేశామన్నారు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయన్నారు. దీనిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు కుట్రలు పన్నుతున్నారన్నారు. చివరకు వలంటీర్ల ద్వారా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు ఇంటి దగ్గరకు వెళ్లి పింఛన్లు ఇచ్చే ప్రక్రియను సైతం అడ్డుకుంటున్నారన్నారు. ప్రజలు ఓటు వేసే ముందు ఆలోచన చేయాలని, వేసే ఓటు మన పిల్లలు, మన భవిష్యత్తుకు మేలు చేసేలా ఉండాలన్నారు. ఈ విషయంలో ఏ మాత్రం అశ్రద్ధ చేసినా సంక్షేమం, అభివృద్ధి దూరమవుతుందన్నారు. తాను నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. ప్రచారంలో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమ్ సింహారెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, గిరి ప్రసాద్, రాము, మహేష్, ఇర్షద్, అఖిల్, తులసి, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను ఆదరించండి

దేశంలో ఏ రాష్ట్రంలో కూడా లేని విధంగా ఒకవైపు సంక్షేమ పథకాలు, మరోవైపు అభివృద్ధి చేస్తున్న జగనన్నను ఎన్నికల్లో మరోసారి ఆదరించాలని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిమూలపు సతీష్ కోరారు. గురువారం కర్నూలు రూరల్ మండల పరిధిలోని నందనపల్లి పంచాయతీలోని భూపాల్ నగర్, మిలిటరీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మణిగాంధీ పాల్గొన్నారు. వీరంతా ఇంటింటికీ వెళ్లి 58 నెలల్లో పేదలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి, చేసిన మేలు గురించి వివరించారు.

'శ్రీకృష్ణార్జునీయం'కు అవార్డుల పంట



బహుమతులు అందుకుంటున్న శ్రీకృష్ణార్జునీయం నాటక దర్శకులు పత్తి ఓబులయ్య, కళాకారులు

కర్నూలు కల్చరల్: మిర్యాలగూడ సాంస్కృతిక కళాకేంద్రం, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక సంస్థ సంయుక్తంగా గత నెల 30 నుంచి ఈనెల 4వ తేదీ వరకు మిర్యాలగూడలో నంది ని అవార్డుల పద్య, సాంఘిక నాటక పోటీలు జరిగాయి. వారం రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో కర్నూలు టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య దర్శకత్వంలో ప్రదర్శించిన శ్రీకృష్ణార్జునీయం పద్య నాటకం విజయభేరి మోగించింది. జాతీయ స్థాయి పద్య నాటక విభాగంలో ఉత్తమ ద్వితీయ ప్రదర్శనగా ఎంపికైంది. దీంతో పాటు వ్యక్తిగత విభాగంలో 6 నందిని బహుమతులు వచ్చాయి. వీరిలో వరుసగా ఉత్తమ నటుడు జీవీ శ్రీనివాసరెడ్డి, ఉత్తమ నటి సురభి ప్రభావతి, ఉత్తమ సహాయ నటుడు పి.రాజారత్నం, ఉత్తమ సహాయ నటి హసీనా, ఉత్తమ మేకప్ చింతా శ్రీనివాసులు, ఉత్తమ రచన పల్లేటి కులశేఖర్ ఎంపికయ్యారు. ఈ కళాకారులను విశ్రాంత జిల్లా కలెక్టర్ గుమ్మల్ల బలరామయ్య అభినందించారు. తెలంగాణలో జాతీయ స్థాయి పద్యనాటక విభాగంలో రెండోసారి వరుసగా ఏడు బహుమతులు సాధించడం పట్ల టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య కళాకారులను ప్రత్యేకంగా అభినందించారు.